క్లుప్తంగా

ఘనంగా విశ్వబంధుత్వ దినోత్సవం



నిజామాబాద్ రూరల్: నగరంలోని నాందేవ్‌వాడలో గల బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ప్రకాశ్ మణి దాది 18వ పుణ్యస్మృతి, విశ్వబంధుత్వ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు రాజేష్, ఆంజనేయులు నేతృత్వంలో పలువురు భక్తులు రక్తదానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రభందకులు బికె సునీతా బెహెన్జీ అన్నారు. అంతకు ముందు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భక్తులు, రక్తదాతలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ నాగారం: నగరంలో ఆదివారం యోగా అసోసియేషన్ ఆఫ్ నిజామాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాశే ఐశ్వర్య, సహ కార్యదర్శులుగా టీవీ ప్రవీణ్ నాయుడు, ఆమదాల రజిత, ఆనంద్, కార్యదర్శిగా సిహెచ్ గంగాధర్, కోశాధికారిగా కమల వాణి, సహ కార్యదర్శులుగా ఎస్ అశోక్, ఎస్ ప్రవీణ్ కుమార్, సభ్యులుగా గాయత్రి, లోహిదాస్, మాధురి, సుధా, విజయభాస్కర్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా మాజీ ఒలిపింక్ సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య ,జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి ప్రశాంత్, తెలంగాణ రాష్ట్ర యోగా అసోసియేషన్ ప్రతినిధిగా ఉప్పు రవీందర్ హాజరయ్యారు.

పేదలకు ఉచిత విద్య, వైద్యం అందాలి



నిజామాబాద్ సిటీ: ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం ఉచితంగా అందించాలని, అప్పుడే ప్రజల్లో జీవన ప్రమాణాలు పెరుగుతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ కంపెనీలకు దేశ సంపదను, వనరులను కట్టబెడుతూ నిరుద్యోగం పెరిగేలా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. ఉపాధిహామీ కూలీలకు పని దినాలను పెంచడంతోపాటు కూలీ రేట్లను పెంచాలన్నారు. నాయకులు బుర్రి ప్రసాద్, సత్యనారాయణ,పెద్ది వెంకట్ రాములు, లక్ష్మి, శంకర్, సాయిలు, గోవర్ధన్, లావణ్య పాల్గొన్నారు.

మహిళలను కించపరిచేలా టీవీ సీరియల్స్



నిజామాబాద్ సిటీ: మహిళలను కించపరిచేలా, కుటుంబ కలహాలు పెంచేలా టీవీ సీరియల్స్ ఉంటున్నాయని ఐద్వా నాయకురాలు బెజుగం సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. నాందేవ్‌వాడలోని ఐద్వా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు హింసను ప్రేరేపించే సీరియల్స్ చూడకుండా ఐద్వా నాయకులు ఆయా ప్రాంతాల్లో అవగాహన కల్పించాలన్నారు. సీరియల్ ప్రభావం పడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్న సమయంలో ఐద్వా ప్రత్యేకమైన కార్యక్రమాలు చేపట్టి అవగాహన కల్పించాలన్నారు. ఐద్వా సభ్యులు అనిత, కళ, లక్ష్మి పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101,600	వెండి(కిలో)	1,20,000
22 క్యారెట్స్	93,795		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	30	60	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	40	80	దోసకాయ	20	40
దొండకాయ	40	80	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	70	120	గోబిగడ్డ	20	40
కాకరకాయ	25	50	గోబిపువ్వు	30	60
వంకాయ	30	60	బీట్‌రూట్	30	60
పాలకూర	40	80	కరివేపాకు	40	80
మెంతికూర	40	80	చామగడ్డ	30	60
కొత్తిమీర	30	60	చిక్కుడుకాయ	30	60
పుదీనా	40	80	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	25	50			

–సుభాష్‌నగర్

పారిశుధ్యం.. అధ్వానం

- నగరంలోని పలు కాలనీల్లో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- దుర్గంధంతో స్థానికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



సాయినగర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ



ఆనంద్‌నగర్‌కాలనీలో పిచ్చిమొక్కలతో నిండిపోయిన అంగన్‌వాడీ కేంద్రం

నిజామాబాద్ సిటీ: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిధిలోని పలు కాలనీల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతోపాటు దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో పందులు సంచరిస్తూ, పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో దోమలు, ఈగలు విజృంభించడంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. అయినా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్ల మధ్యనే మురుగునీరు..

నగరంలో పలు కానీల్లో చెత్త తొలగింపు కార్యక్రమం సాఫీగా సాగడం లేదు. ఇంటింటికీ చెత్త సేకరణ జరిగినా డ్రెయినేజీలను తీయడంలో మాత్రం పారిశుధ్య కార్మికులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. సర్కిల్–3లోని సాయినగర్, సీతారంనగర్, ఆనంద్‌నగర్‌కాలనీ, ఖిల్లా చౌరస్తా, బురుడుగల్లి, పెద్దబజార్‌రోడ్డు, ఆర్‌ఆర్‌చౌరస్తా, శివాజీనగర్, మహ్మదేవీ ఆలయం, గాజుల్‌పేట్ వంటి పలు కాలనీల్లో డ్రెయినేజీలను శుభ్రపరచకపోవడంతో వ్యర్థాలు పేరుకపోయి, మురుగునీరు పారకం జరగడం లేదు. పలుచోట్ల డ్రెయినేజీ నీరు రోడ్లపై పారుతుండటంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. సాయినగర్, ఆనంద్‌నగర్, వర్నిచౌరస్తా, ఫారెస్టు ఆఫీసు తదితర ప్రాంతాల్లో పందులు, కుక్కలు పెద్ద సంఖ్యలో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఆనంద్‌నగర్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా మారాయి.



రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారంలో కుక్కలు, పశువుల ఆవాసం

మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం

బల్దియా పరిధిలో వెయ్యి మందికిపైగా పారిశుధ్య కార్మికులున్నారు. అయినా నగరంలో పారిశుధ్య పనులు సాఫీగా సాగడం లేదు. పారిశుధ్య సిబ్బందిలో చాలామంది చెప్పకుండా డ్యూటీలు మానేస్తున్నారు. మరికొందరూ హాజరువేసుకుని బయటకు వెళ్లిపోతారు. అయినా వీరిపై అధికారులు చర్యలు తీసుకోరు. ఇందుకోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సిబ్బంది నుంచి నెలకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పర్మినెంట్ వర్కర్ల వద్ద రూ.20వేల వరకు ప్రతి నెలా వసూలు చేస్తూ పనిచేయకున్నా వారికి పూర్తిస్థాయి వేతనం ఇస్తున్నారు. కార్మికులు, జవాన్లు, ఇన్‌స్పెక్టర్లపై శానిటరీ సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలి. కానీ వారు పట్టించుకోకపోవడంతో శానిటరి ఇన్‌స్పెక్టర్లు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి, నగరంలో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని, కార్మికులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మోరీలు తీస్తలేరు



ఆనంద్‌నగర్ కాలనీలో మాదే చివరి ఇల్లు. మా ఇంటిముందు ఉన్న డ్రెయినేజీలో మురికినీరు నిలిచి అధ్వానంగా మారింది. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకుంటలేరు. నెల రోజుల నుంచి మోరీలను శుభ్రం చేయడం లేదు. దీంతో పందులు, కుక్కల సంచారంతో పరిసరాలు అధ్వానంగా మారాయి.

–స్వామి, ఆనంద్‌నగర్‌కాలనీ

పందుల సంచారం ఎక్కువైంది



సాయినగర్, ఆనంద్‌నగర్, వర్ని చౌరస్తా ఏరియాల్లో మేతర కులస్తులు ఎక్కువగా ఉంటున్నారు. వారు పందులు పెంచుతున్నారు. వారి పందులు ప్రతీరోజు కాలనీల్లో తిరుగుతున్నాయి. కొన్నిసార్లు వాటిని చూస్తే భయం వేస్తుంది. చిన్నపిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–సురేష్, సాయినగర్‌వాసి

అధికారులు పట్టించుకుంటలేరు



మోరీల్లో వ్యర్థాలు పేరుకుపోయి, మురుగునీరు పారకం నిలిచిపోయింది. దీంతో దుర్గంధం వెదజల్లడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బల్దియా వాళ్లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకుంటలేరు. ప్రతీరోజు చెత్త తొలగిస్తేనే కాలనీలు శుభ్రంగా ఉంటాయి.

–నర్సయ్య, ఆనంద్‌నగర్

ఫిర్యాదులు వస్తే పరిశీలిస్తాం..



నగరంలో శానిటేషన్ పనులు రోజూ జరుగుతున్నాయి. పారిశుధ్యం సమస్యపై ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందిస్తున్నాం. హాజరు వేసుకుని డ్యూటీకి డుమ్మాకొడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం. సర్కిల్–3లో కొందరు వర్కర్లతోపాటు జవాన్లు కూడా ఉన్న విషయం తెలిసింది. వారిపై చర్యలుంటాయి.

–సాజిద్ అలీ, శానిటరీ సూపర్‌వైజర్

వైభవంగా పోచమ్మ పండుగ



సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మ పండుగను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతల నూతన విగ్రహాలను తయారు చేయించి ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు గ్రామ దేవతలను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మాజీ సర్పంచ్ దేవరాజు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు లక్ష్మణ్, లింగం, కరుణాకర్, సాయిలు, గోపి, నర్సయ్య, రాజన్న పాల్గొన్నారు.

బర్త్ అండ్ డెత్ సెక్షన్ ఇన్‌చార్జి దేవీదాస్ బదిలీ

నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జనన, మరణాల ధృవీకరణ పత్రాలు మంజూరుచేసే అధికారి దేవీదాస్ బదిలీ అయ్యారు. ఆయనకు జిల్లా గణాంకాల అధికారిగా ప్రమోషన్ రావడంతో ఆదిలాబాద్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో సీనియర్ అసిస్టెంట్‌ను తాత్కాలికంగా నియమించినట్లు అధికారులు తెలిపారు. దేవీదాస్ బల్దియాలో 18 సంవత్సరాలు విధులు నిర్వహించాడు.

నేడు రక్తదాన శిబిరం

సుభాష్‌నగర్: నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి జన్మదినం సందర్భంగా నగర శివారులోని శ్రీరామగార్డెన్‌లో సోమవారం ఉదయం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ప్రతిఏడాది లాగే ఈసారి కూడా తలసేమియా చిన్నారులు, రోడ్డు ప్రమాద బాధితులు, డెంగీ వంటి విషజ్వరాల బారిన పడి ప్లేట్ లెట్స్ సంఖ్య పడిపోయిన రోగుల కోసం అర్వింద్ యువసేన, అర్వింద్ ధర్మపురి బ్లడ్ డోనర్స్, బీజేపీ కార్యకర్తలు కలిసి రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని యువసేన నాయకులు కోరారు.

మానవతసదన్‌లో మెగా ఆరోగ్య శిబిరం



పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

డిచ్‌పల్లి: ఆరోగ్యంపై అవగాహన లేక చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారని రోటరీ జిల్లా –3150 న్యూ జనరేషన్స్ రీజనల్ చైర్మన్ ఆకుల అశోక్ పేర్కొన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఇందూరు సంయుక్త ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మానవతసదన్‌లో ఉచిత కంటి, దంత, చర్మ సంబంధిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. సరైన పౌష్టికాహారాన్ని తీసుకుంటూ, తగిన వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని సూచించారు. ఆరోగ్య శిబిరంలో మానవతసదన్ విద్యార్థులకు ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పీబీ కృష్ణమూర్తి కంటి పరీక్షలను, ప్రముఖ స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ మానస చర్మ సంబంధిత పరీక్షలను, డాక్టర్ ఆకుల సాయిరోహిత్, డాక్టర్ స్ఫూర్తి దంత పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. విద్యార్థులకు టూత్ పేస్ట్‌లు, టూత్ బ్రష్‌లు, ఆయింట్‌మెంట్ లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ అధ్యక్షుడు శ్యాం అగర్వాల్, కోశాధికారి జుగల్ జాజు, సభ్యులు విజయరావు, బాబురావు, సతీష్ షా, జుగల్ సోని, జ్ఞానప్రకాష్, జితేంద్ర మలాని, బీనా అగర్వాల్, వైద్య సిబ్బంది, మానవతసదన్ కేర్ టేకర్ రమేష్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అండగా షీటీమ్



మాట్లాడుతున్న షీ టీమ్ ఆఫీసర్ హరితరాణి

నిజామాబాద్ అర్బన్: బాలికలకు షీటీమ్ అండగా ఉంటుందని ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు గురైతే తమను సంప్రదించాలని షీటీమ్ అధికారిణి హరితరాణి అన్నారు. నగరంలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో ఆదివారం తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థినీవిద్యార్థులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి న్యాయవాది రజిత, షీటీమ్ అధికారిణి హరితరాణి, గైనకాలజిస్ట్ మల్లీశ్వరీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా రజిత మాట్లాడుతూ.. పోక్సోయాక్ట్ గురించి వివరించారు. అలాగే విద్యార్థినులు వయస్సు రీత్యా వస్తున్న మార్పులను అర్థం చేసుకోవాలన్నారు. హరితరాణి మాట్లాడుతూ.. బాలికలు పోకిరీల నుంచి పొంచి ఉన్న ముప్పును పసిగట్టి షీటీమ్ సహాయంతో వారి ఆగడాలను అరికట్టవచ్చన్నారు. ప్రతిఒక్కరూ సోషల్ మీడియాకు వీలైనంత దూరంగా ఉండాలని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ రామ్, రాష్ట్ర కార్యదర్శి అనిరుద్ రాజు, వినయ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

ప్రతిభ చూపిన క్రీడాకారిణికి అభినందనలు



నిజామాబాద్ నాగారం: అంతర్జాతీయ స్థాయిలో విలువిద్యలో ప్రతిభ చూపిన క్రీడాకారిణి చీకితను ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి, రాష్ట్ర అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అభినందించారు.ఈమేరకు వారు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అండర్–21 విభాగంలో కరీంనగర్‌కు చెందిన చీకిత కెనడాలో జరిగిన అంతర్జాతీయ విలువిద్య పోటీల్లో దేశానికి బంగారు పతకం అందించింది. అలాగే ఆమె కోచ్ క్రాంతి కుమార్‌కు అభినందనలు తెలిపారు. చీకితకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తరపున, తెలంగాణ అర్చరీ అసోసియేషన్ నుంచి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

సురవరం అంత్యక్రియల్లో పాల్గొన్న జిల్లా సీపీఐ నాయకులు



నిజామాబాద్ సిటీ : సీపీఐ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి అంత్యక్రియల్లో జిల్లా సీపీఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో సురవరం పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు. సీపీఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ఓమయ్య, ఏ. రాజేశ్వర్, స్వరూపరాణి, గంగారం, రాధాకుమార్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఇందల్వాయి: మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో ఇటీవల మార్కల రాజు, రావలీలల ఇల్లు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబాలనికి ఆదివారం మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపీ రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.5000 అందజేశారు. అలాగే సిర్నాపల్లి ఉపసర్పంచ్ నవీన్‌గౌడ్ 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, కాంగ్రెస్ నాయకులు చుక్కబొట్ల గంగమణి కొత్త చీరలు, యాచారం సాయిలు 25 కిలోల బియ్యం అందజేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, ఎల్ఐసీ గంగాధర్, గన్నారం గ్రామ అధ్యక్షుడు బద్దం రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దామ సుమన్, ఉపాధ్యక్షులు రోహిత్ గౌడ్, నాయకులు నవీన్ గౌడ్, గంగామణి, జమిల్, యాచారం సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



నిజామాబాద్ అర్బన్: నగరంలోని శివాజీ నగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం నీట్ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. నగరానికి చెందిన దీక్షిత, నైని నీట్‌లో ఉత్తమ మార్కులు సాధించడంతో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి గొండల పృథ్వీరాజ్ సన్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బంగారు రాజశేఖర్, మధుసూదనచారి, చిలుముల భూషన్‌చారి ఉన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి



నిజామాబాద్ రూరల్: బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషిచేస్తామని బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాల శ్రీనివాస్ అన్నారు. హిందూధర్మ పరిరక్షణకు ఆలయాల అర్చకులు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోగల గీత భవనం ప్రాంగణంలో ఆదివారం అర్చకుల అభినందన సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఉమ్మడి రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఇందులో భాగంగా ఆలయాల అర్చకుల అభినందన సన్మాన సభ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అనంతరం పలువురు అర్చకులను సన్మానించారు. వేదిక ఉపాధ్యక్షుడు వెంకట కిషన్ రావు, యుగంధర్, చంద్రశేఖర శర్మ, మల్లికార్జున్, శ్రీనివాస్ రావు, రాజ్ కుమార్ సుబేదార్, రణదీష్ శర్మ, రొట్టె సురేష్ శర్మ, ఇందూరు అర్చక పురోహితల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రశాంత్ జోషి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను అరికట్టాలి

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌ను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో తరచుగా ఆత్మహత్యలు జరగడం, ర్యాగింగ్ ఘటనలు జరగడం, పరిపాటిగా మారిందన్నారు. వెంటనే వీటిని అరికట్టాలన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని పులాంగ్ చౌరస్తాలో ఆదివారం హిమేశ్వర గణేశ్ మండలి వారి వినాయకుడి విగ్రహం ఆగమనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, మాట్లాడారు. ఐక్యత హిందూ ధర్మ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ళ లక్ష్మి నారాయణ, ఇందూరు సుధా, మఠం పవన్, పవన్ ముందడ, మరవర్ కష్ణ, గణేష్ మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి



సుభాష్‌నగర్: అన్నిరంగాల్లో ముందున్న ఆర్యవైశ్యులు రాజకీయ రంగంలో వెనకబడిపోతున్నారని, రాజకీయంగా కూడా ఎదగాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని మహాలక్ష్మీనగర్ వాసవి హైస్కూల్‌లో ఆదివారం వాసవి యువజన సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ఆర్యవైశ్యులు అంటేనే సమాజంలో సేవకు మారుపేరుగా నిలుస్తున్నారన్నారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్‌గుప్త, నూతన అధ్యక్షుడు అంజయ్య గుప్త, ప్రధాన కార్యదర్శి కొండ నర్సింగ్ రావు గుప్త, కోశాధికారి రఘునాథ్ గుప్త, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గన్యతండాలో వైద్య శిబిరం



జక్రాన్‌పల్లి: మండలంలోని గన్యతండాలో ఆదివారం మల్లారెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ప్రకాశ్, శైలజ, చంద్రమోహన్, రాజేశ్వర్, సుజాత, దీప్తినాయక్, నితీష్‌కుమార్ హాజరై రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్నవారికి మందులను పంపిణీ చేశారు. అనంతరం స్వేరోస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు.

ఘనంగా తీజ్ వేడుకలు



కాల్‌పోల్ తండాలో గోధుమబుట్టలతో యువతులు

మోపాల్/సిరికొండ: మోపాల్ మండలం కాల్‌పోల్ తండాలో, సిరికొండ మండలం ముషీర్‌నగర్, మెట్టుమర్రి తండాలో ఆదివారం తీజ్ పండుగను గిరిజనులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తండాల్లోని యువతులు 9 రోజులపాటు గోధుమబుట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజు గోధుమబుట్టలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. అంతకుముందు సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాతా ఆలయాల్లో పూజలు చేసి, బోగ్‌భండార్ నిర్వహించారు.

అ'పూర్వ' సమ్మేళనం



జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2008–09 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులు ఒకే చోట చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవినాథ్, కృష్ణ, దిలీప్, సాయికుమార్, శ్యామ్ బాట్, విద్యార్థులు పాల్గొన్నారు.